# నిద్ర

## శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య

"ఏమిటీ?" అంటూ కళ్లు పెద్దవి చేసి ఆశ్చర్యం ప్రకటించాడు ఆ యువక డాక్టరు.

డాక్టరుకు ఎదురుగా కుర్చీమీద కూర్చుని ఉన్నాడు గంగాధరం. ఎడమవైపు ఎత్తుగా వున్న కిటికీలోనుంచి తెల్లరంగుతో సున్నా గీచినట్టు ఆయన కుర్చీ ఉన్నంత మేరా వెలుతురు పడుతున్నది.

గంగాధరం తల వూపుతూ, "అవును. ఇరవై రోజులనుంచీ...ఒక్క గంటసేపయినా నిద్ర పోలేదు... నాకా తేదీ కూడా బాగా గుర్తు......" అంటూ జేబులోనుంచి అరచేతి సైజులోవున్న బుల్లి డైరీ తీసి ఒక పేజీ తిప్పి చూసుకుని నిట్టూర్చి మళ్లీ మడిచి జేబులో ఉంచుకుంటూ "ఆగస్టు ఎనిమిది" అన్నాడు గొణుక్కుంటున్నట్టు.

డాక్టరు అరచేతితో ఒకసారి నుదురు రుద్దుకుని కళ్లజోడు తీసి రుమాలుతో తుడుచుకుని మొహానికి తగిలించుకుని గంగాధరం వంక కళ్లార్పకుండా ఒక్క నిముషంసేపు చూశాడు. ఆయన అలా తన వంక చూస్తూవుంటే యిబ్బందిగా ఉండి గంగాధరం పైకప్పునుంచి వ్రేలాడుతూ 'గిర్రున' తిరుగుతున్న ఫ్యాన్ వంక చూస్తూ ఉండిపోయాడు.

డాక్టరు, చూపులతోనే తన ఎదురుగా కూర్చుని వున్న నలభై అయిదేళ్ల వ్యక్తిని గురించి సమస్తమూ తెలుసుకుందామని ప్రయత్నించాడు. కాని ఆ ప్రయత్నం బొత్తిగా ఫలించలేదని కొద్ది క్షణాలలోనే తేలిపోయింది.

డాక్టరు లేచి వాచీ చూసుకుని "సరే..... నేనిప్పుడు అర్జంటుగా ఒకచోటికి వెళ్లవలసి వుంది. సాయంకాలం మళ్లీ ఒకసారి కనిపించండి......"

గంగాధరం లేచి ఏదో అడగబోతూవుండగా డాక్టరు తలవూపి "మీరు ఆదుర్దా పడవలసిన పనేమీ లేదు. అదేదో చిన్న ట్రబుల్...నిశ్చింతగా ఉండండి" అంటూ త్వర త్వరగా నడిచి వెళ్లిపోయాడు.

గంగాధరం చేతికర్ర వూపుకుంటూ మెట్లు దిగుతూ విసుగుతో "ఈ కుర్రకారు డాక్టర్లు యింతే. చెప్పేది వినిపించుకోరు. పది విషయాలను గురించి ఒక్కసారే ఆలోచిస్తూ ఉంటారు" అనుకున్నాడు.

ఆయన నెమ్మదిగా నడుస్తున్నాడు. ఉదయం పది గంటలు దాటింది. ఎండలో చురుకుపాలు హెచ్చుతున్నది. విపరీతంగా వర్షాలు కురవవలసిన రోజులు అవి. అయినా ఎండాకాలంలోవలె సూర్యుడు చండ ప్రచండుడై నిరంకుశుడైన ప్రభువులా సమస్త జీవరాసులనూ క్షోభపెడుతున్నాడు. గంగాధరం ఒక యింటి ముందు ఒక్క క్షణం ఆగాడు. ఆ యింటి అరుగు మీద అంత ప్రొద్దెక్కినప్పటికీ ఒక వ్యక్తి ఒళ్లు మరచి నిద్రపోతున్నాడు.

ఆయన మళ్లీ నడవటం ప్రారంభించాడు. వీధి మలుపు తిరగగానే స్నేహితుడి యిల్లు కనిపించింది. శివశంకరాన్ని చూసి చాలా రోజులవుతున్నది. "ఇప్పుడు ఇంటికివెళ్లి వెంటనే చేయవలసిన ఘన కార్యం మాత్రం ఏమున్నది గనుక? వీణ్ణి ఒకసారి పలుకరించి పోదాం." అనుకున్నాడు.

నెమ్మదిగా మెట్లెక్కి ప్రహరీగోడ తలుపు తీసుకుని లోపలికి వెళ్లి పంచలో నిలబడ్డాడు. గోడకు టి. శివశంకరం బి. ఏ. అని—చిన్న బోర్డు ఉంది. ఆయన గంగాధరం గారికి బాల్యమిత్రుడు. రైల్వే టిక్కెట్టు కలెక్టరు.

గంగాధరం తలుపుతట్టి స్నేహితుణ్ణి పిలవబోతున్న వాడల్లా హఠాత్తుగా ఆగిపోయాడు. కిటికీలోనుంచి ఆయనకు కనిపించిన దృశ్యం చూసిన

తర్వాత తలుపు తట్టేందుకు చేతులాడ లేదు. కిటికీలోనుంచి లోపలి పడకగది కనిపిస్తున్నది. అందులో దోమ తెర దింపిన పట్టె మంచం మీద పడుకుని శేష తల్ప గతుడైన విష్ణుమూర్తిలా హాయిగా నిద్ర పోతున్నాడు శివశంకరం.

గంగాధరం నిట్టూర్చి వెనుదిరిగి పోబోతూ ఉండగా "ఎవరదీ?" అంటూ శివశంకరం భార్య తలుపు తీసింది. ఆమె గంగాధరం వంక చూసి "మీరా అలా నిలబడి పోయారేం? పిలవలేకపోయారా?" అన్నది.

ఆయన బెరుకుగా నవ్వి "పిలుద్దామనే అనుకున్నాను. కాని ఆ కిటికీలోనుంచి చూసి ఆ ప్రయత్నం మానుకున్నాను. ఇంతలో మీరూ వచ్చారు" అన్నాడు.

ఆమె అటు చూసి నవ్వి "డ్యూటీ నుంచి యింటికి వచ్చేసరికి తెల్లవారుజామున మూడుగంట లయింది. అప్పటినుంచీ అదే నిద్ర.....ఇంతవరకూ కళ్లు తెరవనైనా లేదు. పోనీ లేపుతాను.....ఉండండి"

గంగాధరం హడావిడిగా "అబ్బే. అక్కర్లేదు. నిద్రపోనీయండి........పాపం! ఎంతగా అలసిపోయి వచ్చాడో........నాకేమీ పనిలేదు కూడా......వూరికే యిటు వెడుతూ 'ఎలాగు యింటిమీదుగా పోతున్నాం కదా, ఒక్కసారి పలకరించి పోదాం..... అనుకుని వచ్చానంతే.....మీ రిప్పు డతన్ని లేపి బంగారం వంటి నిద్ర పాడు చేయకండి.....నేను వెడతాను....." అంటూ ఆమెను వారించి వెనుదిరిగి నడిచి వీధిలోకి వచ్చాడు. ఆమె తలుపు వేసుకుని లోపలికి వెళ్లి పోయింది.

నిద్ర! శివశంకరం హాయిగా నిద్ర పోతున్నాడు.

గంగాధరం యింటికి చేరుకుని చేతికర్ర పంచలో ఒకమూల వుంచి నిట్టూర్చి వాలుకుర్చీలో నడుం వాల్చి కళ్లు మూసుకున్నాడు.

లోపలినుంచి వచ్చిన రాజశేఖరం తండ్రివంక చూసి 'నిద్ర పోతున్నాడేమో' ననుకుని లేపకుండా వూరుకున్నాడు. ఉదయం లేచీ లేవగానే స్నానం చేసి కాఫీ త్రాగే తండ్రి ఎక్కడికి వెళ్లాడో అతనికి తెలియదు. అతడు సోమరిగా గుమ్మాని కానుకుని నిలబడ్డాడు. ప్రహరీ గోడమీద పసుపు పచ్చనిరంగు ముక్కుగల ఒక పిట్ట కూర్చుని ఉండి ఎడతెరిపి లేకుండా వాగుతున్నది. ఆకాశంలో పలుచని మబ్బులు దూది గుట్టలను స్ఫురింప జేస్తున్నాయి.

అంతలో గంగాధరం కళ్లు తెరిచి గుమ్మంలో నిలబడి వున్న కుమారుణ్ణి కళ్లతోనే పలుకరించాడు. రాజశేఖరం "నువ్వు నిద్రపోతున్నావనుకున్నాను నాన్నా! ఇక లేవరాదూ? వంట అయింది. అమ్మ కనిపెట్టుకుని ఉంది కూడా......" అన్నాడు.

గంగాధరం "వస్తున్నా......నువ్వు పద...." అంటూ లేచి ముందు గదిలోకి వెళ్లి పైపంచె బట్టల స్టాండుమీద వేసి చొక్కా విప్పి జేబులో వున్న చిన్న డైరీని తీసి మళ్లీ ఆ పేజీ చూసుకున్నాడు. ఆగస్టు......ఎనిమిదో తారీకు......ఆ పేజీలో మరేమీ వ్రాసి లేదు. కాని లెక్కలేనన్నిసార్లు తీసి మూసిన కారణంగా బాగా మాసిపోయి వుంది. గంగాధరం డైరీని మడిచి సొరుగులోవుంచి తలుపు మూయబోతూ ఒక్క క్షణం ఆగాడు. ఆ సొరుగులోనే లోపలగా ఉన్నాయి ఆ రెండు వస్తువులూ....సూర్యకిరణం కూడా చొరరాని దట్టమైన అరణ్యాలలో పచ్చని చెట్లకు చుట్టుకుని వుండే సన్నటి విషనాగుల వంటి ఆ వస్తువులు తలపుకు వస్తేనే గంగాధరం మనసు కలత చెందుతున్నది.

అంతలోనే లోపలినుంచి పిలుపు వినబడింది. ఆయన సొరుగు మూసి తాళం నొక్కి లోపలికి వెళ్లాడు.

మరొక గంటలో ఆయన భోజనం ముగించుకుని వచ్చి వాలు కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ఆనాడు సెలవు దినం. అందరూ విశ్రాంతి తీసుకుంటున్నట్టున్నారు. ప్రక్క యిళ్లలో కూడా అలికిడి ఏమీ లేదు. ఎదురింట్లో ఒకావిడ తన పిల్లవాణ్ణి కాబోలు మందలిస్తున్నది: "ఇక ఆటలు చాలించి పడుకుంటావా......లేకపోతే నాలుగు తగిలించమంటావా?" అంటూ. ఒక కాకి తీరికగా ప్రహరీ గోడ మూలగా కూర్చుని కునుకుతున్నది.

గంగాధరం లోపలినుంచి ఏమీ అలికిడి వినబడక పోవడంతో నెమ్మదిగా లేచి లోపలికి వెళ్లాడు. ఒక ప్రక్క రాజశేఖరం మంచం మీద పడుకుని ఉన్నాడు. చదువుకుంటూనే నిద్రపోయాడు కాబోలు.....పుస్తకం గుండెల మీద యింకా అలాగే ఉంది. మరొకపక్క నేలమీదనే కొంగు పరుచుకుని నిద్రపోతున్నది ఆయన భార్య.

గంగాధరం మళ్లీ వెళ్లి వాలు కుర్చీలో కూర్చుని కళ్లు మూసుకుని మనసులోకి ఏ ఆలోచనా రానివ్వ కుండా ప్రశాంతంగా నిద్రపోదామని ప్రయత్నిం చాడు. కాని ఎంత సేపటికీ ఆ ప్రయత్నం ఫలిం చకపోవడంతో ఆయనకు చిరాకు కలిగింది. ఇంతకు పూర్వం, అంటే ఆగస్టు ఏడో తేదీ వరకూ, తనకు ఎంత హాయిగా తీయగా నిద్రపట్టేది! భోజనం చేసి అలా కూర్చునేసరికి కొన్ని నిముషాల్లోనే తన వొళ్లు తనకు తెలిసేది కాదు.

లోపల హాయిగా నిద్రపోతున్న కుమారుణ్ణి, భార్యనూ తలుచుకుంటే గంగాధరం గుండెల్లో చేయిపెట్టి కలచినట్టయింది. ఈర్ష్య, అసూయా, మనసులో ప్రేళ్లు తన్ని మహా వృక్షాలై ఆయనను అతలా కుతలం చేసివేశాయి. ఈ రాజశేఖరం ఫైనలియర్ బి. యస్సీ కదా! ఎంత శ్రద్ధగా చదవాలి? పుస్తకం ముట్టుకుంటే చాలు నిద్ర ముంచుకుని వస్తుంది వాడికి. వీలు చూసుకుని కొంచెం మంద లించడం మంచిది. ఆ యింటి దానికి మాత్రం లేశ మైనా బుద్ధి ఉందా? అలా ఎక్కడ పడితే అక్కడ కొంగు పరుచుకుని నిద్రపోతుందేమిటి?

గంగాధరం చిరాకుగా లేచి లోపలికి వెళ్లాడు. కుమారుణ్ణి లేపి "ఇదేనా ఫైనలియర్ చదువు? పుస్తకం ముట్టుకుంటే ఆవులింతలతో నిద్రముంచు కొస్తూ వుంటే, యిక నువ్వేం ప్యాస్ కాగలవు?" అని చివాట్లు పెడదామనుకున్నాడు. కాని ప్రశాంతంగా కలత లేని నిద్రపోతున్న రాజశేఖరం ముఖం చూడగానే ఆయన నీళ్లు కారిపోయాడు. ఎందుకో కాళ్లు వణికాయి. త్వర త్వరగా మళ్లీ వెళ్లి వాలుకుర్చీలో పడుకుని అర చేత్తో నుదురు రుద్దుకుంటూ కూర్చుండిపోయాడు.

శివశంకరం నిద్రపోతున్నాడు!

రాజశేఖరం ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అంతటా అందరూ ప్రశాంతంగా హాయిగా నిద్ర పోతున్నారు.

తనకు నిద్రరాదు...అది యిరవై రోజులఅనుభవం .....పగలు సరే సరి....రాత్రి పూట మరీ దారుణం.... రాత్రివేళల శ్రమ చేయక తప్పనివారూ, వ్యభిచారులూ, దొంగలూ తప్ప మిగిలిన చరాచర ప్రాణికోటి అంతా హాయిగా ఆదమరచి నిద్రిస్తూ ఉంటుంది. కోటీశ్వరుడూ, పూటకు గతి లేనివాడూ, రెక్కాడితే తప్ప డొక్కాడని కూలివాడూ, పదిహేను రోజుల కొకసారి మొదటి తారీకు వస్తే బాగుండుననుకునే మధ్య తరగతి ఉద్యోగీ, కేవలం కాయితాల మీద అంకెలతో వ్యవహరించి బ్యాంకు బాలెన్సులు పెంచు కునే వ్యాపారీ.....అందరూ రాత్రివేళకు ప్రశాంతంగా నిద్రపోతారు.

తనకు నిద్ర పట్టదు. ఇరవై రోజులనుంచీ తనకు పట్టుమని ఒక్క గంటసేపు నిద్ర పట్టిం దెప్పుడు? ఆ బాధతో, క్షోభతో, మెలికలు తిరిగి పోయి తాను తలను గోడకువేసి బాదుకున్న రోజులు ఉన్నాయి. పిచ్చివాడిలా జుట్టు పీక్కున్న రోజులూ ఉన్నాయి. ఆత్మహత్య చేసుకుందామనిపించిన వేళలూ ఉన్నాయి. నిస్సహాయుడై కన్నీళ్లు పెట్టుకున్న సమ యాలూ ఉన్నాయి. అన్నిటికీమించి ఈ దుస్థితి తన అర్ధాంగికి తెలియకుండా ఉంచేందుకు ఆయన పడిన పాట్లూ, "ఎందు కలా ఉన్నారు?" అని ఆమె ఎన్నోసార్లు వేసిన ప్రశ్నకు సమాధానం సూటిగా చెప్పకుండా కప్పదాట్లు వేసినప్పటి ఆత్మవంచనా, ఆయనకు విపరీతంగా బాధ కలిగించాయి. అన్నిటికీ మూలం....ఆ రోజు.....

*　　　*　　　*

ఆగస్టు ఎనిమిదో తేదీ.....రాత్రి ఎనిమిది గంటలవేళ......ఆ చిన్న స్టేషనులో ప్రయాణి కులు కూర్చునే బల్లమీద మోకాళ్ల చుట్టూ చేతులు చుట్టుకుని కూర్చుని ఉన్నాడు గంగాధరం. ఆ హాల్లో పై కప్పునుంచి మందమైన వెలుతురు యిస్తున్న లాంతరు వ్రేలాడుతున్నది. స్టేషను బయట అంతా చిమ్మ చీకటి......కనుచూపుమేర అంతటా వ్యాపించి వున్న పొలాలమీది నుంచి చల్లని యీదురుగాలి పదునుగా చురుకుగా వీస్తున్నది. శరీరం మీద పదునైన సన్నని బ్లేడుతో గాట్లు పెడుతున్నట్లు వీస్తున్న ఆ చలిగాలి ప్రతాపం భయంకరంగా వుంది. గంగాధరం ఎక్కవలసిన రైలు మరొక గంటకుగాని రాదు. ఆయన పైపంచె చెవుల చుట్టూ చుట్టుకుని అలాగే కూర్చున్నాడు.

ఆయన బీదకుటుంబంలో పుట్టి పెరిగిన వాడు. చిన్నతనం నుంచీ అనేక కష్టాలు ఎదుర్కో వలసి వచ్చింది. తండ్రి మరణం, తల్లి దైన్యం. పరవ దారుణమైన బీదరికం, దాయాదుల ఔదాసీన్యం....

అన్నీ అనుభవించాడు. చివరకా పల్లెటూళ్లో ఆయనకు మిగిలినదల్లా తాత ముత్తాత లెవరో కట్టించిన యిల్లు ఒక్కటే. ఆ యింట్లో ఒక బడి పంతులు చిన్న తరగతుల పిల్లలకు బడి పెట్టుకుని పాఠాలు చెప్పుకుంటూ కొన్ని ఏళ్లుగా కాలక్షేపం చేస్తున్నాడు. ఆయన సంవత్సరానికి అరవై రూపాయల చొప్పున యిస్తానని ఒప్పుకున్నాడు. అనుకున్న మాట ప్రకారం యిచ్చాడు కూడా. కానీ, యీ సంవత్సరం అతడు ఎంతకూ రాకపోయేసరికి గంగాధరం "మళ్లీ సమయం తప్పిపోతే యిక అతడు యివ్వలేడేమో!" అనే అనుమానంతో తానే బయలుదేరి వెళ్లా డక్కడికి. తీరా ఆయనను చూసి ఆ పంతులు అమితంగా నొచ్చుకుని "నాకు తీరిక లేక ఆలస్యం చేసి మీకు శ్రమ యిచ్చాను. మన్నించండి......" అని క్షమాపణ చెప్పుకుని ఆరు పది రూపాయల నోట్లు ఆయన చేతిలో వుంచి "భోజనానికి ఉండమ"ని ఎంతగానో బలవంతం చేశాడు. భోజనాలయిన తర్వాత అతని భార్య—ఇద్దరు పిల్లల తల్లి గుమ్మంలో నిలబడి గంగాధరంతో "బాబుగారూ! మీ యింటికి వచ్చాక ఏదో గుడ్డిలో మెల్లగా కొంచెం హాయిగానే వెళ్లిపోతున్నాయి రోజులు....." అన్నది కృతజ్ఞత కళ్లలో నిండుతూ వుండగా. ఆమె భర్త మాటల ధోరణిలో గతంలో తాము అనుభవించిన బాధలూ, నడిపిన వ్యవహారాలూ, అన్నీ వివరంగా చెప్పాడు. గంగాధరం నిజానికి మరొక పది రూపాయలు అద్దె ఎక్కువచేసి యిమ్మని అడుగుదామని ముందుగా అనుకున్నాడు. కాని ఆ దంపతుల ఆదరణా, పిల్లల కలుపుగోలుతనమూ చూసిన తర్వాత అలా అడగ బుద్ధి కాలేదు సరికదా, వారు మొదట్లో డబ్బు యివ్వరేమోనని అనుమానం కలిగినందుకు సిగ్గుపడవలసి వచ్చింది. వారు తమ సర్వస్వాన్నీ దాయాదుల దౌష్ట్యం వల్ల పోగొట్టుకుని యిక్కడికి చేరుకుని కొంచెంగా పచ్చబడుతున్నారు. వారిని అద్దె మరి కాస్త ఎక్కువగా యిమ్మని అడిగి బాధ పెట్టడం ఆయనకు యిష్టంలేక పోయింది. అలా అని తానూ పెద్ద సంపన్నుడేమీ కాదు. చిన్నప్పటినుంచీ ఎంతో జాగ్రత్తగా కాలం గడుపుకు రావడం అలవాటయినందున తనకు వచ్చే నూట పాతిక రూపాయలతో గడుస్తూనే ఉన్నది. తానూ, తన భార్యా, చదువుకుంటున్న కొడుకూ లేమితో బాధ పడిపోతున్నదేమీ లేదు. చిన్నతనం నుంచీ భోగ భాగ్యాల మీదా, డబ్బువల్ల రాదగిన సుఖాల మీదా, ఆడంబరాల మీదా ఆట్టే మనసు లేదు కూడా ఆయనకు. ఆ కుటుంబాన్ని చూస్తేనూ, వారికి తన పట్లవున్న కృతజ్ఞత తలుచుకుంటేనూ కడుపు నిండినట్టయింది.

స్టేషనులో బండి రాకను నిరీక్షిస్తూ అలా కూర్చునివున్న గంగాధరం మనసులో ఆ చిత్రమైన కోరిక కలిగిన క్షణం చాలా బలమైనది. ఆయన వెంటనే లేచి కౌంటరు దగ్గరికి వెళ్లి లోపల ఏదో పని చూసుకుంటున్న స్టేషనుమాస్టరుకు తన వూరిపేరు చెప్పి సెకండు క్లాసు టిక్కెట్టు ఎంత అవుతుందో కనుక్కున్నాడు.

మూడవ తరగతికీ, రెండవ తరగతికీ భరించరానంత తేడా ఏమీ లేదు. పైగా వందలకొద్దీ మైళ్ల దూరం అయితే సందేహించవచ్చునేమో గాని యిదేమంత దూరమనీ? ఆయన రైలు ప్రయాణం చేయవలసి రావడమే అరుదు. ఇన్ని యేళ్ల జీవితంలోనూ ఆయన వ్రేళ్లమీద లెక్కపెట్టదగినన్ని సార్లు మాత్రమే రైలు ప్రయాణం చేయవలసి వచ్చింది. జనంతో క్రిక్కిరిసి గందరగోళంగావున్న మూడవ తరగతి పెట్టెలో ప్రయాణీకు డాయన. జీవితంలో కూడా ఆయన 'ర్యాంక్' అదే. ఇవాళ జేబులో ఏదో ఒక బాపతు డబ్బు కొంచెం ఉండడంతో ఆయనకు "ఈ ఒక్క సారికీ సెకండు క్లాసులో ప్రయాణం చేస్తే నష్టం ఏమిటీ?" అనిపించింది. ఆ తర్వాత ఆయన ఎక్కువ ఆలోచించ లేదు. జేబులోనుంచి ఒక పది రూపాయల నోటు తీసి వ్రేలితో మోగించి పట్టుకుని కూర్చున్నాడు. సెకండు క్లాసు కంపార్టుమెంటు అంటే ఒక దృశ్యం గుర్తుకు వచ్చింది. చిన్నతనంలో రైలు స్టేషనుకు తోటి స్నేహితుడితో వచ్చా డొక సారి. అప్పుడు మూడవ తరగతి పెట్టెలు మామూలుగానే జనంతో క్రిక్కిరిసి పుల్లలతో నిండిన అగ్గిపెట్టెల వలె ఉన్నాయి. కాని రెండవ తరగతి పెట్టెల సంగతి వేరు. వాటిలో జనమే వేరు. లోపల అంతా లేత ఆకుపచ్చని ఆహ్లాదకరమైన రంగు.....జనం లేకపోయినా వేగంగా తిరుగుతున్న పంకాలు..... మెత్తని పరుపులవంటి సీట్లు......శిల్పవతుగా చూస్తూ నిలబడిపోయి స్నేహితుడు వీపుతట్టి "పోదాం పద" అనే వరకూ ఈ లోకంలోనే లేడుతాను.

ఇప్పుడెలా ఉంటుందో! మారు మూల రైలు మార్గం కాబట్టి ఖాళీగానే ఉండవచ్చు. కాని, యిటీవల జనంలోనూ చాలా మార్పు వచ్చింది. ప్రతివాడూ తన యోగ్యతా యోగ్యతలను సరకు చేయకుండా ఆడంబరాలకు పోతున్నారు. ఉన్ననాడు పండుగ చేసుకోవటం, లేనినాడు పస్తుండటం ఈనాటి తీరు. అందువల్లనే సినిమా హాల్లో, రైళ్లలో పై తరగతి జనం ఎక్కువవుతున్నారు. అలా అని వీళ్ల జీవన ప్రమాణం బాణవేగంతో పెరిగిపోయిందని కాదు. ఒక్కొక్కప్పుడు కొన్ని రైళ్లలో రెండవ తరగతి పెట్టెలూ, మూడవ తరగతి పెట్టెలూ ఒకే మోస్తరుగా ఉండవచ్చు కూడా. అయినా ముందు ఆలోచనలు దేనికి?

రైలు మరొక పావుగంటలో రాబోతున్నదనగా స్టేషనుమాస్టరు కౌంటరు దగ్గరికి వచ్చాడు. గంగాధరం పది రూపాయల నోటు అందించి సెకండు క్లాసు టిక్కెట్టూ, మిగిలిన చిల్లర నోట్లూ తీసుకుని జేబులో వేసుకున్నాడు. తర్వాత ప్లాట్‌ఫారం మీదికి వెళ్లి చేతులు వెనక్కు కట్టుకుని ఠీవిగా అటూ యిటూ పచార్లు చేయడం ప్రారంభించాడు.

చల్లని గాలి దిగంతాల నుంచి 'రివ్వు' న వీస్తున్నది. స్టేషనుకు దూరంగా ఎక్కడో నక్క ఒకటి అరుస్తున్నది. ఒక పోర్టరు తలచుట్టూ గుడ్డ చుట్టుకుని చేతిలో దీపంతో నడిచివచ్చి 'గణగణ'మని గంట మోగించాడు. రాత్రివేళల మాత్రమే విహరించే పక్షి ఏదో ఆ గంట మ్రోత విని వికృతంగా అరుచుకుంటూ ఎగిరి పోయింది. దూరంగా రైలు ఇంజను కూత వినబడుతున్నది.

కొద్ది క్షణాలలోనే చీకటిని చీల్చుకుంటూ శక్తివంతమైన లైటుతో వచ్చి నిలిచింది రైలు. ఆ స్టేషనులో ఒక్క నిముషమైనా నిలబడిందో లేదో అంతలోనే గార్డు విజిలు వూది పచ్చ దీపం చూపించాడు. ఇంజను మళ్లీ 'భోం' అని పెనుకేక పెట్టి కదిలింది.

గంగాధరం రైలు వేగం హెచ్చేవరకూ గేటులో నిలబడి తర్వాత వెనుదిరిగాడు. అది పెద్ద రెండవ తరగతి పెట్టె.నాలుగు భాగాలుగా విభజించబడి వుంది. గంగాధరం వరుసగా చూసుకుంటూ ఆ చివరికొస వరకూ నడిచాడు. మొదటి మూడు భాగాలూ ఖాళీ. ఒక్క పురుగైనా లేదు. నాలుగవ భాగంలో చివరగా, మూసివున్న కిటికీ ప్రక్కగా కూర్చుని ఉన్నాడొక వయస్సు మళ్లిన వ్యక్తి. అక్కడ యిక ఎవరూ లేరు. గంగాధరం మొదటి విభాగంలోకి వెళ్లి కూర్చుని కిటికీలోనుంచి బయటికి చూశాడు. నల్లరంగు కాయితం మీద మరింత నల్లని సిరా పడినట్టు రైలు పొగ చీకటిలో కలిసి ఎత్తుగా ఎగిరి పోతున్నది. నిప్పు రవ్వలు కొన్ని ఉండి ఉండి వెనక్కు దూసుకుని పోతున్నాయి.

అలా అరగంట ప్రయాణం జరిగిన తర్వాత గంగాధరం మనసులో చికాకువంటి భావం మొదలయింది. ఆ అరగంటలోనూ ఆయన కొంతసేపు కాళ్లు బార జాపుకుని కూర్చున్నాడు. కొంతసేపు హాయిగా పడుకుని కళ్లు మూసుకున్నాడు. కొంతసేపు లైటు చుట్టూ ముసురుతున్న పురుగులను గమనించాడు. కొంతసేపు రైలు ఆపేందుకు పనికి వచ్చే గొలుసు వంక చూశాడు. దాని క్రింది వ్రాయబడివున్న నోటీసు చదివాడు. తర్వాత "అంత చిన్న గొలుసు లాగితే వేగంగా పరుగెత్తే రైలెలా ఆగిపోతుందో" అని ఆలోచించాడు. ఎంత ఆలోచించినా ఆ సమస్య తీరలేదు. తర్వాత "ఆ విషయం తెలియకపోతే వచ్చి పడిన నష్టం మాత్రం ఏమిటి? లెమ్మ"నుకున్నాడు. తర్వాత ఏదో ఒక విషయం గురించి ఆలోచిద్దామని ప్రయత్నించాడు. కాని మెదడంతా ఖాళీ అనిపించింది. ఎందుకో అంతలోనే అలసట కలిగినట్టయింది.

మూడవ తరగతి పెట్టెలో అయితే యిలా హాయిగా కాళ్లు బార జాపుకుని పడుకునేందుకు వీలు దొరికేది కాదు. కాని సర్దుకుని కూర్చునేందుకు స్థలం దొరికే ఉండేది. ఇక పోతే యిలా తోచక యిబ్బంది పడటం అనే ప్రశ్న అక్కడ లేనే లేదు. అక్కడ రక రకాల మనుషులుంటారు. రక రకాల విషయాలు మాట్లాడుకుంటూ ఉంటారు. వూరికే వింటూ కూర్చుంటే చాలు. కాలం యిట్టే గడిచి పోతుంది. అక్కడ యీ పాటికి తనతో ఎవరో ఒకరు సంభాషణ ప్రారంభించి ఉండేవారు. ఆ మాట్లాడే వ్యక్తి మరీ కుర్ర సన్యాసి కాకుండా నాలుగు విషయాలు తెలిసిన అనుభవజ్ఞుడై వుంటే మంచిది. ఆ విషయాలు కూడా తమ యిద్దరికీ సంబంధించినవై ఉంటేనే మంచిది. ఆయన

తనకు గుండెల మీద కుంపటిలా వున్న పెళ్లి కెదిగిన కుమార్తె సంగతీ, తాను సంబంధాలు కుదరక పడుతున్న పాట్లూ వివరిస్తూ గంటల తరబడి బాధ పెట్టకుండా వుంటే మంచిది. హాయిగా మాట్లాడుకోవాలంటే ఎన్ని విషయాలు లేవు? రాజకీయాలున్నాయి. సాహిత్యం వుంది. ఇంకా ఎన్నో ప్రాపంచిక విషయా లున్నాయి.

అనవసరంగా జైల్లో బంధించబడినట్టుగా వున్న దాయన స్థితి యిప్పుడు. పోనీ నిద్ర పోదా మనుకున్నా పెందరాళే నిద్రపోయే అలవాటు తనకు లేదు. కాని నిద్రవేళ అయితేమటుకు యిక ముంచుకుని వచ్చేస్తుంది. అప్పుడిక ఆ వచ్చే నిద్రను ఆపడం తన శక్తికి మించిన పని. ఇంకా చాలా స్టేషన్లున్నట్టున్నాయి మధ్యలో.

ఆయన "యిక యిలా లాభం లేద"నుకుని లేచి చివరి భాగంలోకి వెళ్లి ఆ వయసు మళ్లిన వ్యక్తి ఎదురుగా కూర్చున్నాడు. తీరా తెలిసిందేమిటంటే ఆ మనిషి బొత్తిగా మనలో లేడు. "రైలు కుదుపుతో ఎంత హాయిగా నిద్ర పట్టిందో పాపం" అనుకున్నాడు గంగాధరం.

ఆ వ్యక్తి చాలా ధనవంతుడివలె కనిపిస్తున్నాడు. ఖరీదైన ఖద్దరు లాల్చీ తొడుక్కుని ఉన్నాడు. కనీసం అరవైయేళ్ల వయసుంటుంది. తెల్లని వెంట్రుకలు ఫ్యాను గాలికి నుదుటిమీద పడి కదులుతున్నాయి. వ్రేలికి ఎమరాల్డ్ ఉంగరం ఒకటి ఉంది. దానిమీద లైటు కాంతులు వేయిరెట్లుగా విశ్లేషణం చెంది కళ్లను చెదరగొడుతున్నాయి. చుట్టుప్రక్కలగాని పై బెర్తుమీదగాని పెట్టె బెడ్డింగు వంటి వేవీ లేవు. అతనివాళ్లో ఒక ఖరీదైన జేబు గడియారం వుంది. దాని అందమైన గొలుసు నెమ్మదిగా క్రిందికి జారుతున్నది. ఆయన ప్రక్కనే తళతళలాడుతున్న స్టీలు చాకు కూడా ఉంది. నిద్ర పట్టక ముందు ఏమీ తోచక ఆయన గోళ్ల కత్తిరించుకుంటూ కూర్చున్నాడు కాబోలు. "అయినా గొప్ప కోసం కాకపోతే నలుగురితో కలవకుండా మాల కాకుల్లాగా యిలా డబ్బు తగలేసి ఒంటరిగా కూర్చోవడం ఎందుకో" అనుకున్నాడు గంగాధరం మళ్లీ. ఆ వ్యక్తి మేలుకుని వుంటే గుడ్డిలో మెల్ల అన్నట్టు కొంచెం నయంగా ఉండేది. మరో రకంగా అనుకునేందుకు కూడా వీలున్న దిప్పుడు. ఒకవేళ మేలుకుని ఉన్నా అతడు 'పక్క మనిషితో మాట్లాడటం అంతస్థుకు లోటు' అనుకునే తరహా మనిషి అయితే? తన ఆఫీసులో పార్వతీశం తత్వం అంతే.....పలుకే బంగారమయినట్టు పెదవి విప్పడు. అదొక గొప్ప అనుకుంటాడు పైగా. అటువంటి వారిని చూస్తే తనకు చిరాకు. "అయినా యీయన గారికి తీరా తొమ్మిదయినా కాకుండా అంత మొద్దు నిద్ర ఏమిటో....." అనుకున్నాడు గంగాధరం మళ్లీ కాస్సేపాగి.

రైలు వేగంగా పోతున్నది. తన వైపు కిటికీ తీయబోయి మళ్లీ ఆ ప్రయత్నం మానుకున్నాడు గంగాధరం. తలుపు తీస్తే చలిగాలి పెద్దపులిలా వచ్చి మీదపడుతుంది మరి......

అంతలోనే ఆయన చూపులు ఎదుటివ్యక్తి వాళ్లో సిల్కు లాల్చీమీద వున్న గడియారం మీద నిలిచాయి. అది చాలా విలువైన గడియారం. తనకు తెలిసిన ఒక మేజిస్ట్రేట్ దగ్గర యిటువంటిదే ఒక గడియారం వుంది. దాన్ని ఆయన చాలా గొప్పగా దర్జాగా వాడుకుంటాడు. ఆయన దర్జాలో సగం పైగా ఆ గడియారం వల్ల సంక్రమించినదే అనిపిస్తుంది. అవసరం వున్నా లేకపోయినా పదిసార్లు పదిమందిలోనూ దాన్ని యివతలికి తీసి చూసుకోవడం మళ్లీ జేబులోకి జార్చుకోవడం.....ఇది ఆయనకు బాగా అలవాటయి పోయింది...అటువంటి గడియారం తనకు వుంటే బాగుండునని గంగాధరం చాలాసార్లు అనుకున్నాడు. అయినా అది తీరని కోరికగానే ఉండిపోయింది. ఈ తక్కువ జీతం వచ్చే క్యాషియర్ ఉద్యోగంలో అది బహుశా అసలు తీరదేమో కూడా. తన కొడుకు పెద్దవాడై పెద్ద ఉద్యోగం సంపాయిస్తే, వాడి సంపాదన సంసారపు ఖర్చులు పోగా బోలెడంత మిగిలిపోయేంత ఎక్కువ అయితే, అప్పుడు తీరుతుందేమో యీ కోరిక. అయినా ఆనాటికి వాడి బుద్ధి ఎలా ఉంటుందో, ఏమిటో!

అంతలో ఆ గొలుసు బరువుకు గడియారం క్రమంగా క్రిందికి జారడం గంగాధరం గమనించాడు. రైలు కుదుపుకు కొద్ది కొద్దిగా అది క్రిందికి జరిగివస్తున్నది. క్రిందపడిపోయేందుకు మరొకనిముషం కూడా పట్టదేమో ! గంగాధరం కన్నార్పకుండా అటే చూస్తున్నాడు. అంతలోనే అనుకున్నంతా అయింది. ఆ

గడియారం గొలుసు బరువుకు ముందుకు జరుగుతూ జరుగుతూ వచ్చి ఒక్కసారిగా క్రింద పడింది. అయినా ఆ వ్యక్తి కదలలేదు. మెదలలేదు.

గంగాధరం ఆదుర్దాగా వంగి దాన్ని చేతిలోకి తీసుకుని "ఏమండీ! గడియారం పడిపోయింది" అన్నాడు. అప్పటికీ ఆ వ్యక్తిలో చలనం లేదు. ఆయన లేచి ఆ వ్యక్తి భుజం పట్టుకుని కుదిపి లేపేందుకు ప్రయత్నించాడు. అంతలోనే ఆ వ్యక్తి తల వాలిపోవడం శరీరం ఒక ప్రక్కకు ఒరిగిపోవడం చూసి ఆయన గుండెలు ఝల్లుమన్నాయి. ఒక్కసారిగా భయంతో శరీరం నిలువెల్లా కంపించి పోయింది. ఆ గడియారం అక్కడే పడేసి ఒక్క పరుగుతో యివతలికి వచ్చి గొలుసు లాగబోయి మళ్లీ ఎందుకో ఆగిపోయాడు. నుదుట పట్టిన చెమటను మళ్లీ మళ్లీ తుడుచుకుంటూ యివతల కూర్చుండిపోయాడు. శరీరంలో వొణుకు యింకా తగ్గలేదు. మనసులో ఎన్నో ప్రశ్నలు కందిరీగలవలె ముసురుతున్నాయి. ఒక్కదానికీ సమాధానం లేదు.

తర్వాత ఒక గంట సేపటికి రైలు ఒకటి రెండు నిర్జనమైన స్టేషన్లలో ఆగి మళ్లీ కదలటం ఆయన గమనించాడు. క్రమ క్రమంగా తన వూరు దగ్గర పడుతున్నది. ఆయన కళ్లముందు ఆ ఖరీదైన గడియారం, చిన్న పాముపిల్లవంటి గొలుసు, తళతళలాడే స్టీలు చాకూ కదలాడుతున్నాయి.

గంగాధరం క్షణ క్షణానికీ పైపంచెతో మొహం తుడుచుకుంటూనే ఉన్నాడు. అయినా అంత చలిలోనూ ఉక్కపోస్తున్న దెందుకో!

కాలం చాలా బద్ధకంగా కదలలేని మెదలలేని పెద్ద కొండచిలువ వొళ్లు విరుచుకుంటున్నట్టు నెమ్మదిగా కదులుతున్నది.

తాను దిగవలసిన స్టేషను దగ్గర పడుతూ ఉండగానే గంగాధరం లేచి నిలబడి ఒక్క క్షణం ఆలోచించాడు. తర్వాత త్వర త్వరగా నడిచివెళ్లి మెరుపు వేగంతో ఆ గడియారమూ, చాకూ రెండూ అందుకుని జేబులో వేసుకుని ఒక్క అంగలో యివతలికి వచ్చి గేటు దగ్గర నిలబడ్డాడు. రైలు వేగం తగ్గుతున్నది. కొద్దిదూరంలో స్టేషను దీపాల వెలుగు కనిపిస్తున్నది.

రైలు పూర్తిగా ఆగకుండానే గంగాధరం యివతలికి ఒక్క దూకు దూకి దాదాపు పరుగెత్తుతున్నట్టే వేగంగా నడిచి గేటులో టిక్కెట్టుయిచ్చి బయటికి వచ్చాడు. స్టేషను మెట్లు దిగి నిలబడి గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు. ఆయన అక్కడ నిలబడి ఉండగానే రైలు మళ్లీ కూతవేసి బయలుదేరి వెళ్లి క్రమంగా కనుచూపుమేర దాటి పోయింది. ఆ తర్వాత ఆయన నెమ్మదిగా నడిచి యింటికి వచ్చేశాడు.

ఆ మరునాటినుంచి అసలైన తమాషా ప్రారంభం అయింది. గంగాధరం మరునాడు స్నానం చేసి భోజనం ముగించుకుని దుస్తులు ధరించి భార్య కంట పడకుండా గడియారం జేబులో పడేసుకుని మెట్లు దిగాడు. వీధిలోకి వెళ్లి అప్పుడు గడియారాన్ని ఒకసారి పైపంచెతో తుడిచి గొలుసు బటన్ హోల్‌లో ఉంచుకని జేబులో ఉంచుకున్నాడు. తర్వాత మామూలు ప్రకారం నడక సాగించాడు. ఆ గడియారం గుండెకు సమీపంలో జేబులో ఉండటం తలుచుకుని కొంతసేపు ఠీవిగా దర్పంగా నడిచిన మాట వాస్తవమే. గడియారం కోసం యికముందు కుట్టించుకునే చొక్కాలకు ప్రత్యేకంగా జేబులు పెట్టించుకోవాలని కూడా అనుకున్నా డాయన.

కాని క్రమంగా ఏందుకో ఆయాసం ఎక్కువైంది. ఆఫీసుకు వెళ్లి తన సీటులో కూర్చుని పని చూసుకుంటున్నంతసేపూ గడియారం టిక్కు టిక్కుమని ధ్వనించడం వినిపిస్తూనే వుంది. ఆ ధ్వని క్రమంగా ఎక్కువైంది. తన గుండెల మీద ఏదో అదృశ్య హస్తం సమ్మెటతో భీకరంగా కొడుతున్నట్టు అనిపించసాగింది. గుండెలు నిముష నిముషానికీ ఎక్కువగా దడ దడ లాడుతున్నాయి. ఒళ్లంతా చెమట పట్టింది. కొద్ది సేపటిలోనే అలుపూ, ఆయాసమూ ఆయనను లోగొన్నాయి. గడియారం తీసి అవతల ఉంచితే గాని గుండె దడ తగ్గలేదు.

ఎన్నడూ ఎంత డబ్బుతో వ్యవహరించినా పైసా అయినా లెక్కలలో పొరపాటు రాలేదు. ఆరోజు సాయంకాలానికి పాతిక రూపాయల చిల్లర లెక్కతేల లేదు. నుదుట పట్టిన చెమటను క్షణ క్షణానికీ తుడుచుకుంటూ ఆయన ఆఫీసు టైము అయిన తర్వాత గంటసేపు అదనంగా కూర్చుని ప్రయాస పడ్డాడు. అయినా ఆ ప్రయత్నం వ్యర్థమే అయింది. ఆ పాతిక రూపాయలూ గంగలో కలిసినట్టే.....దానికితోడు యింటికి వెళ్లేసరికి చేతి వ్రేలికి కట్టు కట్టుకుని

కొడుకు ఎదురుగా రాగానే ఆయన అదిరిపడ్డాడు. విచారించగా తేలిన దిది. పక్కయింటి కుర్రవాడు "పెన్సిలు చెక్కియమ్మ"ని రాగా బ్లేడు కోసం సొరుగు తీయగానే తళతళలాడుతున్న చాకు కనిపించిందతనికి. దాన్ని తీసుకుని పెన్సిల్ చెక్కటం ప్రారంభించాడు. అంతలో ఏం జరిగిందో మరి క్షణంలో వ్రేలు తెగి రక్తం ఆగకుండా వరదలుగా కారడం మొదలయింది.

గంగాధరం గడియారం తీసి సొరుగులో చాటుగావుంచి గుండెల నిండుగా గాలి పీల్చుకుని మనసును కూడగట్టుకని జరిగిన దాన్ని తేలికగా మరిచిపోదామని ప్రయత్నం చేశాడు. ఆయన గుండెల మీద సమ్మెటపోటు అయితే తగ్గింది కాని మన స్థితి మాత్రం జ్వరం పడి లేచిన రోగి వతుగా తయారయింది. ఆనాడు రాత్రి కలల మూలంగా బంగారం వంటి నిద్ర చెడింది. పైన తన కంఠానికి ఎదురుగా సన్నని దారానికి వ్రేలాడుతున్నది తళతళలాడుతున్న కత్తి. దాని మొన పదునుగా భయంకరంగా మెరుస్తున్నది. గడియారం ఆడుతున్న ధ్వని కొన్ని వేల రెట్లు పెద్దదై వినబడుతూనే ఉన్నది. అంతలో హఠాత్తుగా ఆ దారం తెగి కత్తి నేరుగా తన కంఠం మీదికి పడింది. ఆయన 'కెవ్వు'న కేక పెట్టి లేచాడు.

ఆ మెలకువ రావడం తర్వాత మళ్లీ ఇరవై రోజులయినా ఆయన కళ్లు మూత పడనే లేదు.

*　　　*　　　*

గంగాధరం వాలు కుర్చీలోనుంచి లేచి వరండాలో అటూ యిటూ తిరగడం ప్రారంభించాడు. తనను పరీక్ష చేసిన యువక డాక్టరూ, ఆయన కళ్లజోడు తుడుచుకోవడం గుర్తు వచ్చారు. తాను "యిరవై రోజులనుంచీ, అస్సలు నిద్రి అనేది ఎరగను" అని చెప్పినప్పుడు అతను వెలిబుచ్చిన ఆశ్చర్యం గుర్తుకు రాగానే కొంచెం నవ్వు కూడా వచ్చింది.

లోపల అంతవరకూ హాయిగా కమ్మగా నిద్రపోయిన రాజశేఖరం లేచినట్టున్నాడు. అతడు నెమ్మదిగా పుస్తకంలో పుటలు తిరగవేస్తూ చదువుకుంటున్నాడు. ఆమె కూడా లేచి పాత చీరె కుట్టుకుంటూ కూర్చున్నది.

గంగాధరం తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. తర్వాత ఆ నిర్ణయంలో గల ఉచితానుచితాలను గురించి తర్కించుకున్నాడు. ఏది ఏమైనా అంతకంటె మార్గాంతరం లేదని తీర్మానించుకున్నాడు. తానీ మానసిక కల్లోలం నుంచి బయట పడాలంటే అదే మార్గం....."ఈ నిర్ణయానికి రావడానికి గాని, అసలు యింతగా బాధ పడటానికి గాని తన మానసిక బలహీనతే కారణమేమో" అనిపించింది. పాపచింత బలహీనత లక్షణమే అని కొందరనుకోవచ్చు. అయినప్పటికీ తాను సిగ్గు చెందనక్కర లేదు. పాపచింతకు బలహీనతే కారణం అయితే ఆ బలహీనత తనలో ఉన్నందుకు సిగ్గిల పనిలేదు. ఈ వలయంనుంచి ముందు తాను విముక్తుడు కావాలి.....లేకపోతే తనకు నిద్ర పట్టదు. మన శ్శాంతి ఉండదు.

ఆయన పెరటిలోకి వెళ్లి మొహమూ, కాళ్లూ చేతులూ కడుక్కుని భార్య యిచ్చిన వేడి వేడి కాఫీ త్రాగాడు. తర్వాత ముందు గదిలోకి వెళ్లి లాల్చీ వేసుకుని పైపంచె తీసుకుని చేతికర్ర అందుకుని సొరుగులోనుంచి చాటుగా ఆ రెండు వస్తువులూ అందుకుని జేబులోకి జార్చుకున్నాడు. గుమ్మంలో నిలబడివున్న భార్యతో "నే నలా వెళ్లి చీకటి పడే లోపునే తిరిగి వస్తాను" అని చెప్పి నడిచి వీధిలోకి వచ్చాడు.

చల్లని సాయంకాలపు వేళ. పక్షులు కలకలా రావాలతో జట్లు జట్లుగా ఎగిరి పోతున్నాయి. తెల్ల దూది పింజల వంటి పలుచని మేఘాలు ఆకాశ వీధిలో విలాసంగా కదిలి పోతున్నాయి.

గంగాధరం చేతికర్ర వూపుకుంటూ చాలా దూరం నడిచాడు. వూరి చివర క్వారీ దగ్గర కొండ రాయిని ముక్క ముక్కలుగా కొడుతున్నారు కొందరు కూలీలు. ఒకచోట కొందరు కూలీలు ఎత్తుగా నిలబడి రాయి కొడుతూ ఏదో పాట పాడుతున్నారు. గంగాధరం ఒక్క క్షణం ఆగాడు. వారు పగలంతా యిలా శ్రమించి పని చేస్తారు. పాపపు పనులుచేసే వ్యవధి కూడా వారిలో ఎక్కువ మందికి ఉండదేమో బహుశా! రాత్రి అయేసరికి నాలుగు మెతుకులు తిని వొళ్లెరగని నిద్ర పోతారు. 'నిద్ర పట్టడం లేద'నే ఫిర్యాదు వారిలో వినబడేందుకు అవకాశమే లేదు.

ఆయన యింకా ముందుకు నడిచాడు. అక్కడ జన సంచారం బొత్తిగా లేదు. రాళ్లమధ్య వర్షపు నీరు నిలిచి వుందొకచోట. ఆ నీటి మీద దట్టంగా పచ్చని పాచి పట్టి ఉంది. ఆయన వీలుగా వున్న ఒక చోట కూర్చొని చేతికందిన రాయి తీసుకొని నీళ్లలోకి విసిరాడు. రాయి 'బుడంగుమ'ని నీళ్లలో మునిగింది. అప్పుడు చెదిరిన పాచి అంతా మళ్లీ ఒక చోట కూడి సర్దుకునేదాకా చూస్తూ కూర్చుని మళ్లీ మరో రాయి విసిరాడు! అలా చాలా సేపు ఆయన రాళ్లు విసురుతూ కూర్చుండి పోయాడు.

చీకటి పడుతున్నది. పశ్చిమ దిశ అరుణరాగ రంజితమై వెలుగొందుతున్నది. సూర్యబింబం ఎర్రగా కాల్చబడిన యినుప బంతిలా అస్తమిస్తున్నది. పక్షులు యధాశక్తి పగలంతా రెక్కలు ముక్కలు చేసుకుని ఎగిరి ఎగిరి ఏ దూర ప్రదేశాలకో ప్రయాణం చేసి పొద్దు గూకేసరికి మళ్లీ గూళ్లకు చేరుకుంటున్నాయి. ఇక చీకటి పడుతుంది. దొంగలూ, వ్యభిచారులూ, భూతప్రేతాలూ, రాత్రిపూట శ్రమ చేయక తప్పని వారూ—తప్ప మిగిలిన వారందరూ విశ్రాంతి కోరుకుంటారు. నిద్రాదేవత తన చల్లని పరిపాలన ప్రారంభిస్తుంది.

గంగాధరం లేచాడు. చేతికర్ర వూపుకుంటూ నడవటం ప్రారంభించాడు. ఖాళీ జేబులో చేయి ఉంచుకుని ఆయన నడక వేగం హెచ్చించాడు. ఎందుకో మనస్సూ, శరీరమూ తేలిక పడ్డట్టు అనుభూతి పొందాడు.

ఆయన యింటికి చేరుకునేసరికి రాజశేఖరం లాంతరు ముందు కూర్చుని చదువుకుంటున్నాడు. ఆయన లోపలికి అడుగు పెడుతూనే "అలా దీపం మీదికి వొంగి చదువుతావెందుకురా? దూరంగా జరిగి కూర్చో..." అన్నాడు. రాజశేఖరం నవ్వి దూరంగా జరిగి కూర్చున్నాడు.

గంగాధరం కులాసాగా కబుర్లు చెబుతూ భోజనం ముగించుకున్నాడు. చేయి కడుక్కుంటూ భార్యతో, "ఆ వరండాలో మంచం వాల్చి నాకు పక్క వెయ్యి" అని చెప్పాడు. ఆమె తల వూపి "అలాగే" అన్నది.

ముందు గదిలో రాజశేఖరం శ్రద్ధగా చదువుకుంటూ కూర్చున్నాడు. గంగాధరం ఆ ప్రక్కనే కూర్చుని ఏదో పుస్తకం తిరగవేశాడు కాసేపు. అంతలోనే ఆయనకు ఆవులింత వచ్చింది.....కొద్ది క్షణాల్లోనే కళ్లు మూతలు పడటం ప్రారంభించాయి. ఆయన లేచి పక్క వరండాలోకి వెళ్లి సిద్ధంగా ఉన్న పక్కమీద పడుకుని కళ్లు మూసుకున్నాడు.

ముందు నల్లని చీకటి......ఏవో రంగు దారుల వెంట ప్రయాణం చేస్తున్నట్టు అనుభూతి.....తర్వాత ఏమీ లేని శూన్యంలో బంగారు సింహాసనం మీద నిద్రాదేవత స్నిగ్ధరూపం......ఆమె చాచిన చేతులు..... ఆమె కళ్లలో కరుణా వృష్టి.....

ఆయన భార్య వంట యింటి పని అంతా పూర్తి చేసుకుని అటు వచ్చేసరికి ఆయన గాఢంగా నిద్ర పోతున్నాడు.

పది గంటలు దాటిన తర్వాత ఎవరో వీధి గేటు తీసిన సవ్వడి వినిపించగా రాజశేఖరం లేచి వరండాలోకి వచ్చి చూశాడు. శివశంకరం తెల్లని డ్యూటీ దుస్తులతో గంభీరంగా నడిచి వచ్చి, "ఏమయ్యా రాజా! మీ నాన్నగారున్నారా?" అని అడిగాడు.

రాజశేఖరం, "ఉన్నారండీ. నిద్రపోతున్నట్టున్నారు. లేపమంటారా?" అని అడిగాడు.

ఆయన అంతలోనే వరండా చివరకు వచ్చి హాయిగా నిద్రపోతున్న గంగాధరం వంక చూసి నెమ్మదిగా "అబ్బే! వద్దు....ఆయన నిద్ర పాడు చెయ్యకు. పొద్దున మా యింటికి వచ్చాడని మా ఆవిడ చెప్పింది. నే నప్పటికి నిద్రపోతున్నాను. ఇప్పుడు డ్యూటీకి వెడుతూ వూరికే కనిపించి పోదామని వచ్చాను....... అంతే..." అంటూ వెను దిరిగి బూట్ల సవ్వడి కూడా కాకుండా నెమ్మదిగా నడిచి మెట్లు దిగి వీధిలోకి వెళ్లి పోయాడు.

—